RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం

AKSHARA VEDAM TELUGU DAILY

విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాప్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్

9666992524

Published at Karimnagar circulated in : Telangana | సంపుటి : 04 | సంచిక : 43 | ఎడిటర్ :పొన్నం ప్రసాద్ గౌడ్ | మంగళవారం 13-01-2026 | పేజీలు -8 | వెల: రూ. 05.00

## పీఎస్ఎల్వీ సీ-62 విఫలం!.

### కొత్త ఏడాదిలో ఇస్రో తొలి ప్రయోగం ఫెయిల్

- మూడో దశలో అంతరాయం
- కక్ష్యలోకి చేరని 16 శాటిలైట్లు
- పీఎస్ఎల్వీ ఫెయిల్ కావడం వరుసగా ఇది రెండోసారి



శ్రీహరికోట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కొత్త ఏడాదిలో చేపట్టిన తొలి ప్రయోగం విఫలమైంది. సోమవారం ప్రయోగించిన పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ నిర్దేశిత కక్ష్యను చేరుకోలేకపోయింది. ఓ విదేశీ ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ సహా 16 శాటిలైట్లను ఇది మోసుకెళ్లింది. ఇస్రో చైర్మన్ వీ నారాయణన్ మాట్లాడుతూ, ఈ రాకెట్‌ను నిర్దేశిత ఎత్తుకు నెట్టడానికి మూడో దశలో స్ట్రాప్-ఆన్ మోటార్స్ బలాన్ని అందిస్తున్నపుడు దీని ప్రయాణం దారి తప్పినట్లు, రాకెట్‌లో అంతరాయాలు ఏర్పడినట్లు గుర్తించామన్నారు. దీనికి కారణాన్ని తెలుసుకోవడానికి సునిశిత విశ్లేషణ ప్రారంభమైందని చెప్పారు. నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టడం సాధ్యం కాలేదని, మొత్తం-మిగతా 2 లో




సైబర్ క్రైంపై రాష్ట్ర పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలి

# ట్రాఫిక్ రూల్స్ కఠినతరం

### హద్దులు దాటితే వాహనదారుడి ఖాతా నుంచే చలాన్లు కట్



- విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలి
- ప్రతి మూడు నిమిషాలకు ఓ నిండు ప్రాణం బలి
- రవాణా శాఖ బలోపేతానికి 'ఉన్నతస్థాయి కమిటీ'
- 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి





హైదరాబాద్ జనవరి 12 అక్షర వేదం

రోడ్డు ప్రమాదాలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన సమస్యగా పరిగణిస్తోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేయాలని అధికారులను ఆదేశించారు. చలాన్లకు ముందే నిబంధనలు అమలు చేయాలని తెలిపారు. నిబంధనలు పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరిగి, ప్రాణ నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రూల్స్ బ్రేక్ చేసిన వాహనదారులపై చలాన్లు వేయడం, మళ్లీ డిస్కౌంట్ ఇవ్వడమేంటని ప్రశ్నించారు. చలాన్లపై డిస్కౌంట్లు వద్దౌవాహనదారుడ -మిగతా 2 లో



## మన బంధం మానవాళికి ముఖ్యం

### జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌తో కలిసి కైట్ ఫెస్టివల్ షురూ


- జర్మన్ యూనివర్సిటీలు భారత్‌లో క్యాంపస్‌లు ప్రారంభించాలి
- ద్వైపాక్షిక చర్చల్లో ప్రధాని మోడీ

సబర్మతి: జనవరి 12 అక్షర వేదం

భారత్- జర్మనీ ఆర్థిక వ్యవస్థల మధ్య సహకారం మానవాళికి ముఖ్యమని ప్రధాని మోడీ అభిప్రాయపడ్డారు. జర్మన్ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. రష్యా- ఉక్రెయిన్, గాజా సహా అనేక ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై చర్చించి నట్టు తెలిపారు. ఆసియా పర్యటనలో భాగంగా మొదటగా భారత్‌కు వచ్చిన జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌తో సమావేశమైన -మిగతా 2 లో

## వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడిని నేనే..

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన
- అధికార మార్పిడి సజావుగా జరిగే వరకూ అమెరికాయే నడుపుతుంది : ట్రంప్
- సామాజిక మాధ్యమంలో పోస్ట్




న్యూఢిల్లీ,

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనను తాను వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడిగా తన సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో ప్రకటించుకున్నారు. దీంతో చమురు సంపన్న దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాలో అమెరికా పాత్ర మరోసారి చర్చనీయాంశంగా మారింది. ట్రూత్ సోషల్‌లో ఆదివారం ట్రంప్ తన అధికారిక హెూదాను వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడు, 2026 జనవరి నుంచి అని ప్రకటించుకుంటూ అమెరికాకు 45వ, 47వ అధ్యక్షుడు, 2025 జనవరి 20 నుంచి అని కూడా తెలియచేశారు. వెనెజువెలాపై భారీ స్థాయిలో సైనిక దాడి జరిపిన కొన్ని వారాల తర్వాత ట్రంప్ తన అధికారిక హెూదాను అనూహ్యంగా -మిగతా 2 లో



## తెలంగాణ పిటిషన్‌కు విచారణ అర్హత లేదు

- మహారాష్ట్ర, కర్నాటక వాదనలూ వినాల్సి ఉంది
- సివిల్ సూట్‌తో రావాలని సుప్రీంకోర్టు సూచన
- పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై రిట్ పిటిషన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ జనవరి 12 అక్షర వేదం

పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అధికారికంగా ప్రకటించారు. పిటిషన్ ఉపసంహరణ నేపథ్యంలో కేసును డిస్పోజ్ చేసినట్టుగా ధర్మాసనం వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు నుంచి నల్లమల సాగర్‌కు నీటిని తరలించే లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. -మిగతా 2 లో

# భూకబ్జాలపై ఉక్కుపాదం

### అక్రమార్కుల భరతం పడతాం



- రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలు
- పేదలు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు : రెవెన్యూ మంత్రి పొంగులేటి
- కూకట్‌పల్లిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన

హైదరాబాద్ జనవరి 12 అక్షర వేదం

భూకబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అక్రమార్కుల భరతం పడతామని చెప్పారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మండలంలో ఎస్ఎస్ఆర్ బిల్డర్స్ నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను పూర్తిగా పారదర్శకంగా, అవినీతి రహితంగా తీర్చిదిద్దే దిశగా -మిగతా 2 లో

## బెంగాల్‌లో 2 నిపా వైరస్ కేసులు

2 లో







## జిల్లాలు రద్దు చేస్తే అగ్గి పుట్టిస్తాం

- కాంగ్రెస్ పాలనలో ఆగిన పల్లె ప్రగతి
- కేసీఆర్ పాలనలో మైగ్రేషన్ నుంచి ఇరిగేషన్‌గా మార్చాం
- మున్సిపల్ ఎన్నికల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర
- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మహబూబ్‌నగర్ జనవరి 12 అక్షర వేదం

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పల్లెల్లో ఉన్న ట్యాంకర్ల ఇంజిన్‌లో డీజిల్ లేదు.. ట్యాంకర్‌లో నీళ్లు లేవు.. పల్లె ప్రగతి ఆగింది.. అని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల సర్పంచులకు సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంబీసీ మైదానంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పల్లెలు అభివృద్ధిలో పట్టణాలతో పోటీపడే వాతావరణం ఉండేదని అన్నారు. పార్కులు, -మిగతా 2 లో




## గ్రోక్‌పై రెండు దేశాలు బ్యాన్

- గ్రోక్ నకిలీ, అశ్లీల డీప్‌ఫేక్ చిత్రాలను సృష్టించిందనే ఆరోపణ
- ఇండోనేషియా, మలేషియా దేశాలు దీనిని తాత్కాలికంగా నిషేదం
- గోక్‌లో మహిళలు, పిల్లలను లక్ష్యంగా చేసుకొని కొంతమంది నకిలీ నకిలీ, అశ్లీల డీప్‌ఫేక్ చిత్రాలను సృష్టి

వాషింగ్టన్

ప్రపంచ ధనవంతుడు ఎలోన్ మస్క్‌కు చెందిన యొక్క ప్రసిద్ధ ఎఐ చాట్‌బాట్ గ్రోక్ మరోసారి వివాదంలో చిక్కుకుంది. గ్రోక్ నకిలీ, అశ్లీల డీప్‌ఫేక్ చిత్రాలను సృష్టించిందనే ఆరోపణల నేపథ్యంలో ఇండోనేషియా, మలేషియా దేశాలు దీనిని తాత్కాలికంగా నిషేధించాయి. గ్రోక్‌లో మహిళలు, పిల్లలను లక్ష్యంగా చేసుకొని కొంతమంది నకిలీ నకిలీ, అశ్లీల డీప్‌ఫేక్ చిత్రాలను సృష్టిస్తున్న క్రమంలో ఈ రెండు దేశాలు గ్రోక్ ఎఐపై కఠినమైన చర్యలు తీసుకున్నాయి. గ్రోక్ టెక్నాలజీ డిజిటల్ ప్రపంచంలో కొత్త ముప్పుగా మారిందని ఇండోనేషియా, మలేషియా దేశాలు పేర్కొన్నాయి. కాగా, గ్రోక్ ద్వారా అశ్లీల, అభ్యంతరకరమైన కంటెంట్ వ్యాప్తి చెందడంపై ఇటీవల భారత ప్రభుత్వం కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. గ్రోక్ ద్వారా సృష్టిస్తున్న ఈ కంటెంట్ ప్రజల అనుమతి లేకుండా సృష్టించబడుతోంది. ఇది వారి గౌరవం, భద్రతకు ముప్పు కలిగిస్తుంది. -మిగతా 2 లో

# పీఎస్ఎల్వీ సీ-62 విఫలం!.

మొదటి తరువాయి

16 ఉపగ్రహాలు రోదసిలో పడిపోయాయని తెలిపారు.

ఇదిలావుండగా, ఇస్రో వర్గాల కథనం ప్రకారం, పీఎస్ఎల్వీ మిషన్ మూడో దశలో విఫలమవడం వరుసగా ఇది రెండోసారి. నిరుడు మే నెలలో చేసిన ప్రయత్నం మోటార్ ప్రెజర్ సమస్య వల్ల విజయవంతం కాలేదు. ఇస్రో మాజీ శాస్త్రవేత్త ఒకరు మాట్లాడుతూ, సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి, అర్థం చేసుకుని, అవసరమైన దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి కొంత సమయం పడుతుందన్నారు. 22.5 గంటల కౌంట్‌డౌన్ ముగిసిన తర్వాత సోమవారం ఉదయం 10.18 గంటలకు ఈ రాకెట్‌ను ప్రయోగించారు.

ఇది దూసుకెళ్తుండగా దాని వివరాలను ప్రత్యక్ష ప్రసారంలో శాస్త్రవేత్తలు వెల్లడించారు. ప్రారంభ దశలు ప్రణాళికకు అనుగుణంగానే జరిగాయి. "థర్డ్ స్టేజ్ ఇగ్నైటెడ్" అనే ప్రకటన రావడంతో మిషన్ కంట్రోల్ సెంటర్‌లో బాధాకరమైన నిశ్శబ్దం తాండవించింది. ఈ మిషన్ ఖర్చు ఎంతన్నది ఇస్రో వెల్లడించలేదు. అయితే గత పీఎస్ఎల్వీ ప్రయోగాలకు రూ.250-300 కోట్లు ఇస్రో ఖర్చు పెట్టినట్టు సమాచారం.

**16 శాటిలైట్లు కోల్పోయాం..**

పీఎస్ఎల్వీ సీ62 విఫలం కావడంతో 16 శాటిలైట్లను కోల్పోయాం. ఇందులో ప్రధానమైనది ఈవోఎస్-ఎన్1 లేదా అన్వేష. ఇది ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్. దీనిని డీఆర్డీవో నిర్మించింది. దీనిని భూమి మీద నుంచి 511 కి.మీ. ఎత్తులో ప్రవేశపెట్టవలసి ఉంది. ఈవోఎస్-ఎన్1 అనేది హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజింగ్ శాటిలైట్. భూమిపైగల మట్టి, నీరు, లోహాలు, చెట్లు, కాంక్రీట్ నిర్మాణాలు వంటివాటిపైన పడే సూర్య కాంతి పరావర్తనాల ఆధారంగా వాటిని ఏ మెటీరియల్‌తో తయారు చేశారో గుర్తించడానికి దోహదపడుతుంది. ప్రజా అవసరాలు, వ్యూహాత్మక కార్యకలాపాలకు ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది.

దీనితోపాటు దేశవిదేశాలకు చెందిన మరో 15 ఉపగ్రహాలను కూడా పీఎస్ఎల్వీ సీ62 మోసుకెళ్లింది. వీటిలో అయుఐశాట్, సీజీయూశాట్, ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ ఉన్నాయి. ఆయుఐశాట్ భారత దేశపు తొలి ఇన్-ఆర్బిట్ ఫ్యూయలింగ్ శాటిలైట్. సీజీయూశాట్‌ను విద్యార్థులు అభివృద్ధి చేశారు. ఇది లో ఎర్త్ ఆర్బిట్ శాటిలైట్. దీనిని ఎమర్జెన్సీ కమ్యూనికేషన్స్, విపత్తు నిర్వహణ కోసం డిజైన్ చేశారు.

# మన బంధం మానవాళికి ముఖ్యం

మొదటి తరువాయి

నేపథ్యంలో మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యా రంగంలోనూ ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని పెంచేందుకు రోడ్‌మ్యాప్‌పై చర్చించారు. గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఇరు దేశాధినేతలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. ఇందులో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్, విదేశాంక కార్యదర్శి విక్రమ్ మిస్రీ పాల్గొన్నారు. వాణిజ్యం సహా పెట్టుబడులు, శాస్త్ర, సాంకేతికం, విద్య, నైపుణ్యం, రక్షణ, భద్రత, పరిశోధన రంగాల్లో సంబంధాల బలోపేతంపై చర్చించారు.

కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన ప్రధాని

అంతకుముందు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను ప్రధాని మోడీ ప్రారంభించారు. జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌తో కలిసి ఆయన గాలిపటం ఎగురవేశారు. ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. మెర్జ్‌తో కలిసి సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించిన ప్రధాని మోడీ మహాత్మా గాంధీకి నివాళులు అర్పించారు.

# వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడిని నేనే..

మొదటి తరువాయి

విధంగా ప్రకటించారు. అమెరికా దళాలు తమ సైనిక ఆపరేషన్‌లో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ని అరెస్టు చేసి న్యూయార్క్‌కు తరలించాయి. ప్రస్తుతం వారిద్దరూ నార్కో-టెర్రరిజం అభియోగాలను అమెరికాలో ఎదుర్కొంటున్నారు. సురక్షితమైన, సరైన, న్యాయపరమైన అధికార మార్పిడి జరిగే వరకు వెనెజువెలా పాలనను అమెరికా పర్యవేక్షిస్తుందని ట్రంప్ సైనిక ఆపరేషన్ తర్వాత ప్రకటించారు. మరో నాయకత్వ శూన్యత ఏర్పడడం వెనెజువెలా ప్రయోజనాలకు హాని చేయగలవని కూడా ట్రంప్ చెప్పుకొచ్చారు. మదురో పదవీచ్యుతి అనంతరం వెనెజువెలా ఉపాధ్యక్షురాలు, చమురు మంత్రి డెల్సీ రోడ్రిగ్స్ గత వారం ఆపద్ధర్మ అధ్యక్షురాలిగా ప్రమాణం చేశారు. అయితే వెనెజువెలా ఆపద్ధర్మ ప్రభుత్వం అమెరికాకు 3 నుంచి 5 కోట్ల బ్యారెళ్ల అత్యంత నాణ్యతతో కూడిన చమురును అప్పగిస్తుందని కూడా ట్రంప్ ప్రకటించారు. రెండు దేశాలకు ప్రయోజనం చేకూరే విధంగా డబ్బు లావాదేవీలను అమెరికా ప్రభుత్వం చూసుకుంటుందని ఆయన వెల్లడించారు. వెంటనే ఈ ప్రణాళికను అమలు చేసే బాధ్యతలను ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్‌కు అప్పగించిన ట్రంప్ వెనెజువెలా నుంచి చమురును అమెరికా రేవులకు నౌకల ద్వారా తరలించాలని ఆదేశించారు. త్వరలోనే క్యూబాకు చమురు సరఫరా, ఆర్థిక సహాయాన్ని నిలిపివేయనున్నట్లు కూడాట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ తన సోషల్ మీడియాలో తనను తాను వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రకటించుకున్నప్పటికీ ఇది వికీపీడియాలో కాని ఇతర పబ్లిక్ రికార్డుల్లో కూడా ఇప్పటివరకు చోటుచేసుకోలేదు.

# జిల్లాలు రద్దు చేస్తే అగ్గి పుట్టిస్తాం

మొదటి తరువాయి

శ్మశాన వాటికలు, మొక్కల పెంపకం, గ్రామసభలు, క్రీడా మైదానాలు ఇలా అనేక కార్యక్రమాలతో ప్రగతిని పరిగెత్తించిన రోజులు ఇప్పుడు కనిపించడం లేదన్నారు. కళ్యాణలక్ష్మి మొదలుకొని రైతుబంధు వరకు ఏ ఒక్క పథకం కాంగ్రెస్ పాలనలో అమలు కావడం లేదని ఆరోపించారు. రెండేండ్ల పాలనలో ఏ ఒక్క పనీ మొదలు పెట్టలేదన్నారు. కొత్త పనులు చేయలేక అసమర్థ ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకొని.. బూతు మాటలతో ప్రతిపక్ష పార్టీల నాయకులను బెదిరించడమే పనిగా పెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డిని ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో 40 శాతం సర్పంచులను గెలుచుకున్న గులాబీ దళం.. రాబోయే మున్సిపల్ ఎన్నికలు మొదలుకొని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో జైతయాత్రను కొనసాగించాలని పిలుపునిచ్చారు. పాలమురు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు బీఆర్ఎస్ పాలనలో 90 శాతం పూర్తి చేస్తే.. మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయకుండా నీళు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వ పాలన ఉందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో పాలమూరు జిల్లాను మైగ్రేషన్ నుంచి ఇరిగేషన్‌గా మార్చామని చెప్పారు. 17న ముఖ్యమంత్రి ఈ జిల్లాకు వచ్చే ముందు.. ఐటీ పార్కులో 13 పరిశ్రమలు ఎందుకు వెళ్లిపోయాయో, కొత్తగా ఒక్క పరిశ్రమను కూడా ఎందుకు తేలేదో ప్రజలకు సమాధానం చెప్పి రావాలని సవాల్ విసిరారు. జిల్లాలను రద్దు చేస్తే అగ్గి పుట్టిస్తామని హెచ్చరించారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, అలంపూర్ విధేయుడు, వివిధ అనుబంధ సంఘాల కార్పొరేషన్ల మాజీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ కఠినతరం

మొదటి తరువాయి

బ్యాంక్ అకౌంట్ నుంచి నేరుగా చలాన్ల డబ్బులు కట్ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో బ్యాంకులతో అనుసంధానం కావాలని పోలీస్‌శాఖను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ యూసుఫ్ గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర పోలీస్ శాఖ నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. రవాణా శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల్లో కొంత మంది ఈ ఉద్యోగాన్ని డిమోషన్‌లా భావిస్తున్నారని అన్నారు. డీజీస్థాయి లేదా అదనపు డీజీస్థాయి అధికారి పర్యవేక్షణలో రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. సమాజంలో నేరాల విషయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మన దేశంలో ప్రతి నిమిషం ఒక రోడ్డు ప్రమాదం జరుగుతోందని, ప్రతి మూడు నిమిషాలకు ఓ నిండు ప్రాణం బలవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధంలో సైనికుల కంటే ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లోనే చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియంత్రణను రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతా అంశంగా తీసుకుంటోందని తెలిపారు. రోడ్డు



ప్రమాదాల్లో ఎంతో మంది ప్రముఖులు కూడా తమ బిడ్డలను కోల్పోయి దుఃఖంలో మునిగిపోతున్నారని గుర్తు చేశారు. రోడ్డు సేఫ్టీపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాల్సిన అవసరముందని చెప్పారు. మైనర్లు వాహనంతో రోడ్డుపైకి రావడం వల్లే కొన్ని ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వారికి వాహనాలను ఇవ్వకుండా తల్లిదండ్రులు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. మద్యం తాగి బండి నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు.

రాష్ట్ర వ్యాప్తంగా కబ్జాకు గురైన చెరువులను కాపాడుతున్నామని సీఎం గుర్తు చేశారు. చెరువుల విస్తీర్ణం తగ్గిపోవడంతో చిన్న వర్షాలకే సమీప నివాసాలు మునిగిపోతున్నాయని గుర్తు చేశారు. కబ్జాకు గురైన చెరువుల పరిరక్షణకు హైడ్రాను తీసుకొచ్చామని చెప్పారు. ఇప్పుడు సైబర్ క్రైం అనేది అతి పెద్ద నేరంగా మారిందని తెలిపారు. మన తేరుకునే లోపే బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతున్నాయని చెప్పారు. సైబర్ క్రైంను అరికట్టేందుకు స్పెషల్ ఫోకస్ పెట్టామని తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. సమాజానికి డ్రగ్స్ అతిపెద్ద శత్రువు అని తెలిపారు. డ్రగ్స్ మహమ్మారి ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నామన్నారు. డ్రగ్స్, గంజాయి నియంత్రణలో ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పోలీసులకు గుర్తింపు దక్కిందని సీఎం అభినందించారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు రాజ్‌ఠాకూర్, నవీన్ యాదవ్, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర పోలీసున్నతాధికారులు హాజరయ్యారు.

# తెలంగాణ పిటిషన్‌కు విచారణ అర్హత లేదు

మొదటి తరువాయి

ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు లేవని, బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తన పిటిషన్‌లో పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సోమవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తి జస్టిస్ జోరుమల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తెలంగాణా ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. నల్లమల సాగర్ అంశంపై రిట్ పిటిషన్‌తో ముందుకు వెళ్లడం ప్రయోజనకరం కాదని స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు రిట్ పిటిషన్ సరైన మార్గం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌కు విచారణ అర్హత లేదన్నారు. ఇతర ప్రత్యామ్నాయ మార్గాలతో పరిష్కారం పొందేందుకు ధర్మాసనం అనుమతినిస్తుందన్నారు. నల్లమల సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి తమ వాదనలు, అభ్యంతరాలను వినిపించాలంటే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సూచించారు. అదే సరైన న్యాయపరమైన మార్గమని అభిప్రాయపడ్డారు. గోదావరి నదీ జలాల విషయంలో మహారాష్ట్ర, కర్నాటక వాదనలు కూడా వినాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. ఈ రిట్ పిటిషన్‌లో కర్నాటక, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాలను చేర్చలేదని, కానీ మీరు బచావత్ ట్రిబ్యునల్ అవార్డులో ఆయా రాష్ట్రాలు కూడా వాటాదారులేనని




పేర్కొన్నారని జస్టిస్ జోరుమల్య బాగ్చి అన్నారు. ఈ అవార్డులో వాటాదారులు కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మాత్రమే కాదని, మహారాష్ట్ర, కర్నాటక కూడా ఉన్నాయని తెలిపారు. ఆ అవార్డుల ఉల్లంఘనకు సంబంధించి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని, కానీ మీరు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో ఆయా రాష్ట్రాలను పార్టీలుగా చేర్చలేదని జస్టిస్ బాగ్చి అన్నారు. నీటి కేటాయింపుల ఉల్లంఘనలపై అన్ని రాష్ట్రాల వాదనలు వినేందుకు సివిల్ సూట్ దాఖలు చేయాలని ధర్మాసనం సూచించింది. దీంతో తమ పిటిషన్ ఉపసంహరించుకుంటామని తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ అన్నారు. సివిల్ సూట్ దాఖలు చేస్తామని ధర్మాసనానికి ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ ఉపసంహరించుకోవడంతో ఈ కేసును సుప్రీంకోర్టు డిస్పోజ్ ఆఫ్ చేసినట్టు ఆయన ప్రకటించారు. అనంతరం తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మాణం చేయాలనుకుంటున్న ప్రాజెక్టుపై తమ అభ్యంతరాలతో రిట్ పిటిషన్ వేశామని, గత సోమవారం కూడా విచారణ జరిగిందని అన్నారు. ఈ సోమవారం కూడా అదనంగా మరికొన్ని వాదనలను తెలంగాణ ప్రభుత్వం తరపున వినిపించామని తెలిపారు. కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ముఖ్యమైన అంశమని, ఏపీ ప్రభుత్వం అనేకసార్లు ఉల్లంఘనలకు పాల్పడిందని అన్నారు. వాటిని సుప్రీంకోర్టు దష్టికి తీసుకెళ్లామని, స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదని తెలిపామని పేర్కొన్నారు. ఏపీకి 484.5 టీఎంసీలు కేటాయించారని, కానీ అంతకంటే ఎక్కువ నీళ్లు ఉపయోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతుల్లేకుండా ఏపీ ప్రభుత్వం పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుతో ముందుకు వెళ్తుందని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ముందు డిజైన్ చేసిన దానికంటే అదనంగా ఏమీ చేయడానికి వీల్లేదని వాదించామని, పోలవరం ప్రాజెక్టు ఒరిజినల్ ఫామ్‌కు అదనంగా మార్పులు చేయడానికి వీల్లేదని వాదనలు వినిపించామని తెలిపారు.

# భూకబ్జాలపై ఉక్కుపాదం

మొదటి తరువాయి

ప్రభుత్వం కీలక సంస్కరణలను అమలు చేస్తోందని చెప్పారు. ప్రజలకు సౌకర్యం, పరిపాలనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యాధునిక సౌకర్యాలతో, కార్పొరేట్ స్థాయి ప్రమాణాలతో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా నిర్మిస్తున్నామని అన్నారు. మొదటి విడతలో ఔటర్‌రింగ్‌రోడ్డు పరిధిలో రెండో విడతలో జిల్లా కేంద్రాల్లో, మూడో విడతలో నియోజకవర్గ కేంద్రాల్లో సమీకృత భవనాలను నిర్మిస్తామని వివరించారు. మొదటి దశలో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి నాలుగు జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి భవనాలను నిర్మిస్తున్నామని అన్నారు. ఇప్పటికే గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమి ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) భవనంలో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి



శంకుస్థాపన చేశారని చెప్పారు. ఈ భవనాలను నిర్మించే సంస్థలే ఐదేండ్లపాటు వాటిని నిర్వహించాలని కోరారు. కొత్తగా పెండ్లయి రిజిస్ట్రేషన్‌కు వచ్చే జంటలు, చిన్న పిల్లలతో వచ్చే తల్లులు, పేదలకు సకల సౌకర్యాలుంటాయని వివరించారు. రెండేండ్లుగా ఖజానాకు డబ్బు చేకూరాలనే ఆలోచన కాకుండా పేదలను దృష్టిలో ఉంచుకుని అనేక సంస్కరణలను తెచ్చామన్నారు. పేదలకు ఇచ్చిన భూములతోపాటు ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉక్కుపాదంతో అక్రమాలను అణచివేస్తామన్నారు. ఒకప్పుడు పేదలకు పంపిణీ చేసిన భూములను, అసైన్డ్ భూములను ఒకవేళ ప్రభుత్వం తీసుకోవాలనుకున్నా వారికి తగిన పరిహారం, ప్రత్యామ్నాయ స్థలం మంజూరు వంటి చర్యలు తప్పనిసరిగా ఉంటాయన్నారు. త్వరలో జరగబోయే మేడారం జాతర కోసం భారీ నిర్మాణాలతో ఆధునీకరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రావు, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంత్, ఈ భవన నిర్మాణాన్ని చేపడుతున్న డీఎస్ఆర్ నిర్మాణ సంస్థ అధినేత సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్‌లో 2 నిపా వైరస్ కేసులు

**కోల్‌కతా,**




నిపా వైరస్‌గా అనుమానిస్తున్న రెండు కేసులను పశ్చిమ బెంగాల్‌లోని ఎయిమ్స్ కళ్యాణిలోగల ఐసీఎంఆర్ వైరస్ రిసెర్చ్ అండ్ డయాగ్నస్టిక్ లాబొరేటరీలో ఆదివారం గుర్తించినట్లు అధికార వర్గాలు సోమవారం వెల్లడించాయి. వేగంగా విస్తరించే, అధిక మరణాలకు దారితీసే నిపా వైరస్ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పరిస్థితికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు వారు చెప్పారు. ఇందులో ఓ కేసు భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుకు సమీపంలోని నాడియా జిల్లాలోని ఘుగ్రగచ్చికి ప్రయాణించినట్లు తెలిసిందని వారు చెప్పారు. ఇతరులకు వైరస్ సోకకుండా రాష్ట్ర ప్రభుత్వానికి సాయపడేందుకు జాతీయ సంయుక్త విపత్తు నిర్వహణ బృందాన్ని బెంగాల్‌కు పంపుతున్నట్లు కేంద్రం తెలిపింది.

# గ్రోక్‌పై రెండు దేశాలు బ్యాన్

మొదటి తరువాయి

ఇటువంటి సాంకేతికత సమాజానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తుందని ప్రభుత్వాలు విశ్వసిస్తున్నాయి. అయితే కంపెనీలు యూజర్స్ రిపోర్టింగ్ సిస్టమ్‌పై మాత్రమే దృష్టి పెట్టి, నిజమైన సమస్యకు ఎటువంటి నిర్దిష్ట పరిష్కారాలను అందించలేదని ప్రభుత్వాలు తెలిపాయి. దీంతో గ్రోక్‌ను తమ దేశంలో తాత్కాలికంగా నిషేధించినట్లు తెలిపింది. గ్రోక్ ఉపయోగించి సష్టిస్తున్న నకిలీ, అశ్లీల కంటెంట్ మహిళలు, పిల్లలకు తీవ్ర స్థాయిలో ముప్పు కలిగిస్తుందని ఇండోనేషియా కమ్యూనికేషన్స్, డిజిటల్ మంత్రి ముత్యా హాఫీద్ పేర్కొన్నారు. ఇది మానవ హక్కులు, డిజిటల్ భద్రత యొక్క తీవ్రమైన ఉల్లంఘనగా అభివర్ణించారు.

# నిరంతరం సమాజ చైతన్యంలో ‘ప్రజాపక్షం’పాత్ర అమోఘం

**-బచ్చన్నపేట ఎస్సై ఎస్.కె. హమీద్**




**బచ్చన్నపేట జనవరి 12(అక్షరవేదం)**
నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం గళమెత్తుతూ, నిష్పక్షపాత వార్తలతో దూసుకుపోతున్న ‘ప్రజాపక్షం’ దినపత్రిక సమాజ హితం కోరే పత్రిక అని బచ్చన్నపేట ఎస్సై ఎస్.కె. హమీద్ కొనియాడారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రజాపక్షం దినపత్రిక - 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బచ్చన్నపేట మండల విలేకరి తేలుకంటి శ్రీనివాస్ తో కలిసి ఆయన ఘనంగా ఆవిష్కరించారు.అనంతరం ఎస్సై ఎస్.కె హమీద్ మాట్లాడుతూ,ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని,రాజ్యాంగం కల్పించిన నాలుగో స్తంభంగా జర్నలిజం సమాజ అభివృద్ధికి తోడ్పడుతోందని అన్నారు. వృత్తి పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.నిజాలను వెలికితీయడంలో, ప్రజల పక్షాన నిలబడటంలో ప్రజాపక్షం పత్రిక జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని ఆయన ప్రశంసించారు. పాఠకుల మనసు గెలుచుకునేలా వార్తా కథనాలను అందిస్తూ, ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించడం ఒక్క మీడియాకే సాధ్యమని ఆయన పేర్కొన్నారు.ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో పత్రిక చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నర్సిరెడ్డి, అఖిల, రాకేష్,నవీన్ రెడ్డి,విజయ్, మహేష్, వినయ్,ప్రజాఅక్షరం విలేకరి వనమైన వెంకటేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి

**- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**



**అక్షర వేదం/ వనపర్తి/ ప్రతినిధి/ సురేష్ :**
వనపర్తి పట్టణం వివేకానంద చౌరస్తా నందు గల వివేకానంద విగ్రహానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు.చిన్నారెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద 1863 జనవరి 12న జన్మించారని ఆయన జయంతిని భారత ప్రభుత్వం జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించిందని అన్నారు. స్వామి వివేకానంద గొప్ప భారతీయ వేదాంతవేత్త, యోగా గురువు అని తెలిపారు. వివేకానంద రామకృష్ణ పరమహంస శిష్యులు అని. ఆయన రామకృష్ణ మిషన్‌ను స్థాపించి, హిందూ మతం మరియు వేదాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు అని అన్నారు.1893లో అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల సమావేశంలో “సోదర సోదరీమణులారా” అని ప్రసంగించి, హిందూ మతాన్ని గొప్పగా పరిచయం చేశారు అని అన్నారు. వివేకానంద నా ఆశలన్నీ నవతరం పైనే మనకు కావాల్సింది ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగి వారుఅని యువతను మీ కాళ్ళపై మీరు నిలబడండి అంటూ యువతను వివేకానంద జాగృతం చేశారు అని తెలిపారు. ఆత్మవిశ్వాసం ఉంటే ఎంతటి కార్యాన్నైనా సాధించవచ్చని పిరికితనం మనిషిని నిర్వీర్యం చేస్తే ఆత్మవిశ్వాసం విజయ తీరాల వైపు నడిపిస్తుందని యువతను చైతన్యపరిచారు. నేటి కాలంలో అంతర్జాలం, ఓటీటీలు, సినిమా ప్రేరణతో యువత గాడి తప్పుతుందని మాదక ద్రవ్యాల మత్తులో చిత్తవుతుంది కాబట్టి యువత మేలుకొని మాదకద్రవ్యాలను అరికట్టి భారత దేశ అభివృద్ధికి మీ వంతు సహకారం చూపాలని యువతను కోరారు. నైతిక విలువలను పెంచి మనోబలాన్ని బుద్ధిని వికసింపజేసి స్వ శక్తి పై నమ్మకం పెంచే విద్య దేశానికి అత్యవశ్యకం అని అన్నారు. వివేకానంద యువత క్రీడల్లో ముందుండాలని ఆకాంక్షించారని తెలిపారు. స్వామి వివేకానంద బోధనలు వేలాది మంది ని ప్రభావితం చేశాయని ముఖ్యంగా యువతను ఉత్తేజ పరిచాయి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా ఏఐపిసి అధ్యక్షులు నాగార్జున, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ బాబా, శంకర్ గౌడ్ , వనపర్తి అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాగి అక్షయ్ ,యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ఇర్ఫాన్ , మాజీ కౌన్సిలర్ బ్రహ్మం , వెంకటేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు వెడల్పుపై ప్రజాభిప్రాయ సేకరణకు స్పందన

**- 66 ఫీట్లకు తగ్గించొద్దంటూ సామాన్యుల డిమాండ్**



**అక్షర వేదం,చెన్నూరు, జనవరి 12**
మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణ కేంద్రంలో ఎస్సీ-ఎస్టీ-బీసీ జేఏసీ చెన్నూరు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రోడ్డు వెడల్పుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని అంబేద్కర్ చౌక్ నుంచి రావిచెట్టు ప్రాంగణం వరకు రోడ్డు వెడల్పు చేపట్టాలని ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ఎస్సీ--ఎస్టీ--బీసీ జేఏసీ చెన్నూరు నాయకుడు సిద్ధి రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సౌకర్యాల దృష్ట్యా రోడ్డు వెడల్పు 80 ఫీట్లుగా ఉండాల్సి ఉండగా, ఇటీవల వ్యాపారుల అభ్యర్థన మేరకు దాన్ని 66 ఫీట్లకు కుదించారని తెలిపారు. అయితే కొందరు వ్యాపారులు ఇప్పుడు మరింతగా 40 ఫీట్లకు తగ్గించాలని కోరడం సమంజసం కాదని అన్నారు. రోడ్డుపై ఇష్టానుసారంగా లోడింగ్, అన్‌లోడింగ్ జరగడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారుతున్నాయని, గోడౌన్ల నిర్వహణలో కూడా నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. ఇరుకైన రోడ్ల కారణంగా సామాన్య ప్రజలు రోజువారీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది పట్టణ అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతోందని తెలిపారు.కేవలం కొద్దిమంది వ్యాపారుల ప్రయోజనాల కోసం లక్షలాది మంది ప్రజలు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, భావి తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు వెడల్పును కనీసం 66 ఫీట్లకు తగ్గించకుండా నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారని ఆయన తెలిపారు. అవసరమైతే పట్టణంలోని అన్ని వార్డుల్లో తిరిగి ప్రజాభిప్రాయాలు సేకరించి మంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాలకు చెందిన ప్రజలు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిసి బాలికల,కళాశాల, వసతి గృహం ప్రారంభోత్సవం

**కార్మిక,మైనింగ్ శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామీ,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**అక్షర వేదం,చెన్నూరు, జనవరి 12**
మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణ కేంద్రంలో బిసి బాలికల,కళాశాల, వసతి గృహం ప్రారంభోత్సవం చేసిన కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.కోటపల్లి మండలంలోని కొల్లూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ఇసుక రీచ్ ను ప్రారంభించిన కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి.స్థానికుల అవసరాలు తీర్చేందుకు ఇసుక రీచ్ లు ఏర్పాటు చేయడం జరుగుతుంది. తక్కువ ధరలకి గోదావరి ఇసుకను అందించడం జరుగుతుందని పేర్కొన్న మంత్రి.ఎవరు కూడా అక్రమ ఇసుక దందాను చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించిన మంత్రి వివేక్ వెంకటస్వామి.

# అత్యధిక 1666 నాన్ స్టాప్ ఇండియన్ పుషప్స్ తో ప్రపంచ రికార్డు

**-లంక అశ్వని కుమార్ పాత్రుడుకి భారత్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం కల్పించిన లయన్ డాక్టర్ కె.వి.రమణారావు**




**హైదరాబాద్, జనవరి 12 (అక్షర వేదం) :**
జ్యోతి రంజన్ నెస్ట్, హైదరాబాద్ లో, అత్యధిక 1666 ఇండియన్ పుష్ అప్స్ నిర్విరామంగా(నాన్ స్టాప్) కేవలం 85.30 నిమిషాల్లో చేసి భారత్ వరల్డ్ రికార్డ్స్ లో లంక అశ్వని కుమార్ పాత్రుడు చోటు సంపాదించాడని భారత్ వరల్డ్ రికార్డ్స్ నేషనల్ కోఆర్డినేటర్ లయన్ కె.వి.రమణారావు తెలిపారు. ప్రపంచ రికార్డు నమోదు పత్రాన్ని, మెడల్, మెమెంటోను లంక అశ్వని కుమార్ పాత్రుడుకి అతిథులు ప్రముఖ నిర్మాత బెక్కెం వేణుగోపాల్, ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్, పి.ఆర్.ఓ ధీరజ అప్పాజీల సమక్షంలో సంస్థ నేషనల్ కో-ఆర్డినేటర్ లయన్ డాక్టర్ కె.వి.రమణారావు అందజేశారు. మణికొండలోని డాలర్ హిల్స్ జ్యోతి రంజన్ నెస్ట్ లో జరిగిన ఈ కార్యక్రమానికి నల్లు ఉమా జ్యోతి సహకారం అందించగా ప్రముఖ ఆర్కిటెక్ట్ శ్రీరామ్ నందా, దర్శకుడు, నిర్మాత ప్రణవ స్వరూప్ లు అతిథులుగా పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు



**అక్షర వేదం/హైదరాబాద్/ జనవరి 12,**
తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీదేవి సహకారంతో ఆదివారం రోజు ముసారంబాగ్ విఐపి ఫిజియో తెరఫి సెంటర్ వద్ద మహిళా దివ్యాంగుచే ముగ్గుల పోటి నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో గెలుపొందిన వారికి ఇందులో పాల్గొన్న ప్రతి మహిళకు సోషల్ జస్టిస్ ట్రస్ట్ మరియు యస్ యన్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ శ్రీదేవి బహుమతులు ఇచ్చి గౌరవించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ, కార్యదర్శి మెరుగు శివక్రిష్ణ, మహిళా నాయకులు కళాజ్యోతి, యశోద. ఉమారాణి. గోద,చంద్రప్ప మరియు ప్రవీణ్ పాల్గొన్నారు.

# మేడిపల్లి మారుతి నగర్ లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

**విజేతలకు బహుమతులు అందించిన మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి.**



**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/మేడిపల్లి;జనవరి 12,**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో మేడిపల్లి మారుతి నగర్ కాలనీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ జక్కా వెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, కాలనీ గౌరవాధ్యక్షులు కాశిరెడ్డి నారాయణరెడ్డి, పాల్గొని ముగ్గుల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ “ముగ్గులు మన తెలుగు సంప్రదాయానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకలు. ఇలాంటి పోటీలు మహిళల్లోని సృజనాత్మకతను వెలికితీయడమే కాకుండా, కుల మతాలకు అతీతంగా నిర్వహించినారు ఈ కార్యక్రమాన్ని ఇంత చక్కగా ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు” అని అన్నారు.ఈ కార్యక్రమంలో చిప్ప సంపత్ అధ్యక్షులు గూడూరు పాండురంగ రెడ్డి, జనరల్ సెక్రెటరీ ముత్తినేని రాజు, ట్రెజరర్ వంగాల సతీష్, వైస్ ప్రెసిడెంట్ సృజన, డి సంజీవరెడ్డి, అభిలాష్ రెడ్డి, నాగేశ్వరరావు, ఏవి వెంకటేశ్వరరావు, చంద్రమౌళి, సముద్రాల వెంకటేశం, సత్యనారాయణ, సతీష్ రెడ్డి, కాలనీ పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నగరంలో ఘనంగా జివామె సంక్రాంతి వేడుకలలు

**-స్త్రీల భిన్నమైన దుస్తులని పరిచయం చేసిన శ్రద్ధా దాస్**



**హైదరాబాద్, జనవరి 12 (అక్షర వేదం) :** మకర సంక్రాంతి పండగ స్ఫూర్తిని సమకాలిక ఫ్యాషన్, రిటైల్ అనుభవాల్లో మిళాయించి, భారతదేశపు నెంబర్ వన్ లాంజరీస్, ఇంటిమేట్ వేర్ బ్రాండ్ అయిన జివామె, హైదరాబాద్ లోని నెక్స్ట్ గల్లెరియా మాల్ లోని తన దుకాణంలో నిర్వహించిన ఉత్సాహభరితమైన ఇన్ స్టోర్ వేడుకలను ప్రముఖ సినీ నటి శ్రద్ధా దాస్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారని జివామె బ్రాండ్ మార్కెటింగ్ హెడ్ దామన్ బలి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ 2011లో జివామె భారత దేశపు తొలి ఆన్ లైన్ ఫిట్ కోడ్ ను ప్రారంభించి, మొదటిసారిగా మ్యూజియం ఆఫ్ బూబ్స్ వంటి కేంపెయిన్లని నిర్వహించిందని గుర్తు చేశారు. కొనుగోలుదారులకి శ్రద్ధా దాస్ జనవరి 30వ తేదీ నుంచి ప్రారంభం కాబోతున్న జివామెస్ గ్రాండ్ లాంజరే ఫెస్టివల్ గురించిన ప్రత్యేకమైన ప్రీవ్యూని అందించారని తెలిపారు. లోదుస్తులు, షేప్ వేర్, స్లీప్ వేర్, లాంజ్ వేర్, అథ్లెయిస్యూర్ వంటి జివామె వారి వైవిధ్య భరితమైన పోర్టుఫోలియోని ప్రదర్శించినట్లు తెలిపారు. శ్రద్ధాదాస్ మాట్లాడుతూ హైదరాబాద్ వంటి నగరాల్లో మకర సంక్రాంతి వంటి పండగల సందర్భంగా మహిళలతో కలిసి దీన్ని వేడుక చేసుకోవడం ముఖ్యం అని అన్నారు.

# వివేకానందుని ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

**– జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన మాజీ మంత్రి**



**అక్షర వేదం/ వనపర్తి/ ప్రతినిధి /సురేష్:** వివేకానందుని జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పిన్న వయస్సులో తన సందేశాల ద్వారా స్ఫూర్తి నింపిన మహనీయుడు వివేకానందుడు అని అన్నారు. భారత దేశంలో సంస్కృతి, సాంప్రదాయాలను యువత అనుసరించాల్సిన మార్గాలను ఉపదేశించి చైతన్యం చేశారని పిన్న వయసులో మరణించిన వారి చరిత్ర సూర్యచంద్రులు ఉన్నంతవరకు నిలుస్తుందని కొనియాడారు. యువత వివేకానందుని ఆశయాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస. రమేష్ గౌడ్, నందిమల్ల. అశోక్, పలుస. శంకర్ గౌడ్, కే మాణిక్యం, నాగన్న యాదవ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, డేగ మహేష్ రెడ్డి, చిట్యాల. రాము, నందిమల్ల. సుబ్బు, గిరి, శిరీవాటి. శంకర్, తదితరులు ఉన్నారు.

# చెన్నూరు మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మార్నింగ్ వాక్

**- కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి.**



**అక్షర వేదం, చెన్నూరు, జనవరి 12**
మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీలో మార్నింగ్ వాక్ నిర్వహించిన కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మార్నింగ్ వాక్ నిర్వహించి వార్డులలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని వార్డుల్లో బోర్లు, పారిశుధ్య సమస్యలను వివరించిన వార్డు ప్రజలు. వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించి త్వరలోనే వార్డులలో నూతన సీసీ రోడ్లు, బోర్లు వేసి నీటి ఎద్దడి లేకుండా చూస్తామని హామీ ఇచ్చిన మంత్రి వివేక్ వెంకటస్వామి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మరణానంతరం కూడా వెలుగులు నింపిన బత్తుల వినయ్ కుమార్

**కుటుంబ సభ్యుల సాహసోపేత నిర్ణయంతో ఇద్దరు అంధులకు చూపు**

**క్లబ్ డైరెక్టర్, మాజీ జడ్పీటీసీ గంట వెంకట రమణారెడ్డి**





**అక్షర వేదం:జనవరి 12,రామగిరి**
మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఘటన సెంటినరీ కాలనీలో చోటుచేసుకుంది. సెంటినరీ కాలనీకి చెందిన బత్తుల వినయ్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందగా, తమ అపారమైన దుఃఖాన్ని పక్కనబెట్టి ఆయన కుటుంబ సభ్యులు తీసుకున్న నేత్రదాన నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలిచింది. బత్తుల వినయ్ కుమార్ మరణానంతరం కూడా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఉన్నత భావనతో తల్లి రాధమ్మ, అన్నయ్యలు శేఖర్, విద్యాసాగర్ కలిసి నేత్రదానం చేయాలని నిర్ణయించారు. వారి నిర్ణయం మేరకు ఈరోజు లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ డైరెక్టర్, మాజీ జడ్పీటీసీ గంట వెంకట రమణారెడ్డిని సంప్రదించగా, ఆయన సదాశయ ఫౌండేషన్‌ను సంప్రదించి అన్ని ఏర్పాట్లు చేయించారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వి ప్రసాద్ హాస్పిటల్ టెక్నీషియన్ ప్రదీప్ ఈరోజు నేత్రాలను విజయవంతంగా సేకరించగా, ఈ మహత్తర సేవ ద్వారా ఇద్దరు అంధులకు తిరిగి చూపు ప్రసాదించే అవకాశం లభించింది. తమ కుమారుడిని కోల్పోయిన విషాదంలోనూ, ఇతర కుటుంబాల్లో ఆనందం నింపాలన్న వారి మనోధైర్యం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఇలాంటి గొప్ప నిర్ణయం తీసుకున్న బత్తుల వినయ్ కుమార్ కుటుంబ సభ్యులను లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ప్రతినిధులు, సదాశయ ఫౌండేషన్ సభ్యులు హృదయపూర్వకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. నేత్రదానం వంటి సేవలు సమాజంలో మరింత విస్తరించాలని వారు ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొప్పుల గణపతి, వార్డు సభ్యురాలు రమ, కుటుంబ బంధుమిత్రులు పాల్గొని కుటుంబ సభ్యుల ధైర్యాన్ని, మానవతా భావాన్ని కొనియాడారు.

# యాదవ సర్పంచుల కు ఘనంగా సన్మానం

**యాదవ్ విజన్ టీవీ ఆధ్వర్యంలో యాదవ సర్పంచులకు సన్మాన కార్యక్రమం**

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, పృథ్విరాజ్ యాదవ్,అంబర్పేట్ శ్రీనివాస్ యాదవ్,**



**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/హబ్సిగూడ; జనవరి 12,**
హైదరాబాద్ హబ్సిగూడ ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో యాదవ్ విజన్ టీవీ ఆధ్వర్యంలో కిరణ్ యాదవ్ మరియు నక్క మహేష్ యాదవ్ నేతృత్వంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర యాదవుల సర్పంచుల సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా చిన్న శ్రీశైలం యాదవ్, తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు పృధ్వీరాజ్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్,అంబర్పేట్ శ్రీనివాస్ యాదవ్ (ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్), పాల్గొని తెలంగాణ రాష్ట్రంలో నూతన సర్పంచులుగా గెలిచినటువంటి యాదవ్ బిడ్డలకి ఘనంగా సన్మానం నిర్వహించారు, రాబోయే ఎన్నికలలో యాదవులు మరిన్ని ఎక్కువ స్థానాలలో నిలబడి గెలిపించి, యాదవుల హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని అన్నారు, ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు భూమయ్య యాదవ్, ఈశ్వరమ్మ యాదవ్, మేకల లలిత యాదవ్, కన్నబోయిన రామారావు యాదవ్, చిలకల శ్రీనివాస్ యాదవ్, అజయ్ కుమార్ యాదవ్, సోమనబోయిన సుధాకర్ యాదవ్, పలగొల్ల రాజు యాదవ్, నాగేష్ యాదవ్, గోగు నవిన్ యాదవ్, జిట్టబోయిన మహేష్ యాదవ్, వర వెంకటేశ్వర్లు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, లింగస్వామి యాదవ్, నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీ త్రీ నూతన జిఎం కు టీబీజీకేఎస్ స్వాగత సత్కారం

**బొగ్గు ఉత్పత్తి కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం**


**జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్**



**అక్షర వేదం:జనవరి 12,రామగిరి**
అర్జీ త్రీ రీజియన్ కు నూతనంగా జనరల్ మేనేజర్ గా వచ్చి బాధ్యతలు స్వీకరించిన సుంకర మధుసూదన్ ను తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అర్జీ త్రి ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య నేతృత్వంలో సెంట్రల్ కమిటీ,డివిజన్ కమిటీ,ఓ.సి 1,ఓసి 2,అడ్ర్యాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్,
సిహెచ్ పి పిట్ కమిటీల సభ్యులు ఘనంగా సత్కరించారు. సోమవారం సాయంత్రం సీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులంతా పూల బొకేలు అందించి శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగత శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిఎం మధుసూదన్ మాట్లాడుతూ ఈ డివిజన్లో కంపెనీ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడమే కాకుండా అధిక ఉత్పత్తికి సైతం సమన్వయంతో కలిసికట్టుగా ముందుకు సాగుదాం అన్నారు. దీనికి బాధ్యతాయుతమైన కార్మిక సంఘంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పూర్తి సహకారం అందించాలని కోరారు. నాణ్యతతో కూడిన బొగ్గును వెలికితీయడం తోపాటు కార్మిక సంక్షేమానికి సైతం పెద్దపీట వేసే విధంగా తగు చర్యలు ఉంటాయన్నారు. అనంతరం టీబీజీకేఎస్ ఆర్ జి త్రీ ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య మాట్లాడుతూ ప్రస్తుత గుర్తింపు సంఘానికి ముందు పది సంవత్సరాలు గుర్తింపు సంఘంగా అనుభవం కలిగి కంపెనీ పురోభివృద్ధికి కార్మిక సంక్షేమానికి అనునిత్యం కృషిచేసిన సంఘంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఇకముందు కూడా బాధ్యతతో పని చేస్తూ కార్మికుల సమస్యలను తెలియజేస్తామన్నారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలకు కార్మికులపై ఒత్తిడి లేకుండా రక్షణతో కూడిన పని విధానాలను టీబీజీకేఎస్ స్వాగతిస్తుంది అని వివరించారు. గనులలో నివాస ప్రాంతాలలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం బాధ్యతాయుతమైన సంఘంగా మీకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సంపత్ రెడ్డి, సెంట్రల్ కమిటీ నాయకులు పాశం శ్రీనివాస్,రెడ్డి, బోయినపల్లి శ్రీకాంతరావు,ఈసంపల్లి రమేష్,గట్టు శ్రీనివాస్,ఓసి ఫిట్ సెక్రటరీలు వేముల రవిశంకర్, గిటుకు శ్రీనివాస్,బేస్ వర్క్ షాప్ పిట్ సెక్రెటరీలు చిప్ప సురేష్,భోగం పూర్ణాకర్,ఓసి అసిస్టెంట్ పెట్ సెక్రటరీలు వీరగోని సంతోష్ గౌడ్,సిహెచ్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు టి ప్రవీణ్,సుద్దాల తిరుపతి, కుమ్మరి కుంట వెంకటేశం,మోసం రమేష్,అంబటి చిరంజీవి,పూజారి కిరణ్,గోపిడి శ్రీనివాస్ రెడ్డి, కొలిపాక రాజయ్య,పిట్టల సదయ్య,జగ్గాని యశ్వంత్,సందీప్ రెడ్డి,ఎం శ్రీనివాస్,గరిమిళ్ళ రవీందర్,తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

**- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**





**అక్షర వేదం, మంచిర్యాల, జనవరి 12**
తెలంగాణరాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో ఫోటో ఓటరు జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటన, మున్సిపల్ ఎన్నికల నిర్వహణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కొరకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 12వ తేదీన ఫోటో ఓటరు తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని, ఈ నెల 13న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రకటన అనంతరం పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించి పరిశీలన, పరిష్కారం పిమ్మట ఈ నెల 16న పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ ప్రచురణ కొరకు ప్రింటింగ్ ప్రెస్ లను గుర్తించడం వంటి పనులు పూర్తి చేయాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ జారీ లోగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు మున్సిపాలిటీలలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితా ప్రకటన, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా, తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రకటించి, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, ఫ్లయింగ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, సెక్టోరియల్ అధికారులు, నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో ముందుకు రావాలి

**- పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్**



**అక్షర వేదం:జనవరి 12,రామగిరి**
యువతకు క్రీడలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా యువజన,క్రీడా ప్రాధికార సంస్థ,పెద్దపల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్ టార్చ్ ర్యాలీ సోమవారం పెద్దపల్లి నుండి కమాన్‌పూర్ మండలం మీదుగా రామగిరి మండలంలోని పన్నూర్ ఎక్స్ రోడ్డు వద్దకు చేరుకుంది.ఈ టార్చ్ ర్యాలీకి ఎంపిడిఓ శైలజా రాణి,పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్, సూపరిండెంట్ ఉమేష్,ఇ.సి మౌనిక,సెక్రటరీలు ప్రేమలత,స్వప్న,సి.ఓ సత్యం,టి ఏ లు అఖిల,సుప్రియ,ఫీల్డ్ అసిస్టెంట్లు రాజపూర్ గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి కొమురయ్య ఉపసర్పంచ్ కలవేన శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొని క్రీడా జ్యోతి ర్యాలీకి ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్ మాట్లాడుతూ యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనాలి.క్రీడల పట్ల అవగాహన పెంచుకోవాలి.రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను అనేక రకాలుగా ప్రోత్సహిస్తోంది.గ్రామీణ స్థాయి నుంచి మండల స్థాయి,జిల్లా స్థాయి,రాష్ట్ర స్థాయి వరకు రెండో ఎడిషన్ చీఫ్ మినిస్టర్ కప్ -- 2025 ద్వారా టార్చ్ ర్యాలీ నిర్వహిస్తూ యువతను క్రీడల వైపు ఆకర్షిస్తోంది.టార్చ్ ర్యాలీ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా యువత క్రీడల్లో ముందుకు రావాలి.తెలంగాణ రాష్ట్ర పేరును దేశ స్థాయిలో మరింత ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు ఉంది అని తెలిపారు.

# యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి

**- సర్పంచులు బల్ల రవీంద్రనాథ్, గొడుగు రేణుక**



**బచ్చన్నపేట జనవరి 13(అక్షరవేదం):-**
స్వామి వివేకానంద జయంతి (జాతీయ యువజన దినోత్సవం) సందర్భంగా కట్కూరు గ్రామ పాఠశాల ఆవరణలోని వివేకానంద విగ్రహానికి కట్కూర్ సర్పంచ్ బల్ల.రవీంద్రనాథ్,సోలామయిల్ సర్పంచ్ గొడుగు రేణుక కమలాకర్,కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వివేకానందుడి బోధనలు నేటి యువతకు దిక్సూచి వంటివని,ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడిచి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిపియూఎస్ రాష్ట్ర ఉపాధ్యాయ నేత మునిసి వేణుగోపాల్,బీజేపీ జిల్లా నాయకులు బల్ల శ్రీనివాస్, వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గొడుగు బాలరాజు పాల్గొని వివేకానందుని సేవలను కొనియాడారు.ఈ వేడుకలో గ్రామ ఉపసర్పంచ్ దూల్మిట్ట పర్శయ్య,మాజీ సర్పంచ్ నిడిగొండ శ్రీనివాస్,ఓబీసీ నాయకులు ఏనుగుల రామయ్య,గ్రామ శాఖ అధ్యక్షులు పుట్ట నరసింహులు, పిట్టల శ్రీనివాస్,గంజి గోపాల్ పాల్గొన్నారు. క్రీడా పోటీల నిర్వాహకులు మానుపాడు శ్రీహరి, గాగిలాపురం కరుణాకర్, మరిగడి రాజు, ముష్కిని బాబు,పోలోజు రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# క్విక్ టుడే క్యాలెండర్ ఆవిష్కరణ

**-మేడిపల్లి పీఎస్ లో ఆవిష్కరించిన సీఐ గోవిందరెడ్డి**



**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/మేడిపల్లి; పీర్జాదిగూడ,జనవరి12**
అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రిక 2026 క్యాలెండర్ ను మేడిపల్లి పీఎస్‌లో సీఐ గోవర్ధన్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక చైతన్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమైనదని, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని పిలుపునిచ్చారు. మీడియా రంగంలో అనేక మార్పులు వచ్చాయని, అయినా జర్నలిస్టులు బాధ్యతాయుతంగా మెలగాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. గతంతో పోలిస్తే నేడు సమాచారం అందించడంలో పోటీ పెరిగిందని అయినా ప్రింట్ మీడియా ప్రాధాన్యత తగ్గలేదని అన్నారు. అంతకుముందు క్విక్ టుడే ఎడిటర్ జిల్లాల బుచ్చిరెడ్డి సీఐ గోవర్ధన్‌రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి జర్నలిస్టులు పాల్గొన్నారు

# సర్పంచ్ లను సన్మానించిన మేకల మార్కెట్ నాయకులు



**అక్షర వేదం:జనవరి 12,రామగిరి**
సెంటినరీ కాలనీ లోని మేకల మార్కెట్ లో ఇటీవల ఎన్నికైన స్థానిక రత్నాపూర్ సర్పంచ్ పల్లె.ప్రతిమ పీవీరావు,పన్నూరు సర్పంచ్ చిందం మహేష్ లను సోమవారం మేకల మార్కెట్ నాయకులు ఘనంగా సన్మానించారు.మైసమ్మ దేవాలయంలో పూజరి శ్రీనివాసచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.సర్పంచ్ లను శాల్వాలతో సత్కరించి బొకే అందించారు.ఈ కార్యక్రమంలో శ్రీరామాంజనేయ మేకల మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఒర్రె సురేష్,ఒర్రె సదయ్య,అల్వాల వెంకన్న,అల్వాల తిరుపతి,బత్తిని ఐలయ్య,బనుక అంజి,ఎండీ గఫూర్ తదితరులు పాల్గొన్నారు

# గోదాదేవి కళ్యాణానికి ఆర్జీ త్రీ జి.యం కు ఆహ్వానం



**అక్షర వేదం:జనవరి 12,రామగిరి**
రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో 14 వ తారీకు జరిగే శ్రీ శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణానికి ఆర్జీ త్రీ జి.యం సుంకర మధుసూదన్ కు కల్యాణ ఆహ్వాన పత్రిక అందజేసిన కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి,అదేవిధంగా కల్వచర్ల అభివృద్ధి కోసం సింగరేణి సంస్థ సహకారంతో కల్వచర్ల గ్రామంలో ఉన్న పలు సమస్యలు,హైమాస్ లైట్ల ఏర్పాటు కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరడం జరిగింది.ఈ విషయంపై ఆర్జీ త్రీ జి.యం సానుకూలంగా స్పందించారు.సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయం తప్పకుండా అందజేస్తానని చెప్పడం జరిగింది,అదేవిధంగా కల్వచర్ల గ్రామానికి నూతనంగా సర్పంచ్ గా ఎన్నికైన సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు

# మొదటి గ్రామ సభ ఘనంగా నిర్వహణ

**పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్**



**అక్షర వేదం:జనవరి 12,రామగిరి**
సోమవారం రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిందం మహేష్ అధ్యక్షతన జనరల్ బాడీ మీటింగ్ మరియు మొదటి గ్రామ సభ నిర్వహించబడింది.ఈ సందర్భంగా పన్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ సమస్యలపై గ్రామ సర్పంచ్ చిందం మహేష్, ఉపసర్పంచ్ మరియు పంచాయతీ సెక్రటరీ కి సభ్యులు వివరించారు.దీనిపై వారు సానుకూలంగా స్పందించి,సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ గ్రామ సభకు పిలుపునిచ్చిన వెంటనే స్పందించి, పెద్ద మనసుతో సహకరించిన గ్రామ పెద్దలకు, యువతీ యువకులకు,అధికారులు,అనధికార ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలకు సర్పంచ్ చిందం మహేష్ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గ్రామాభివృద్ధి,మౌలిక వసతులు, పారిశు ధ్యం,విద్యుత్, త్రాగునీరు,రోడ్లు తదితర అంశాలపై సభలో విస్తృతంగా చర్చించి,వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ప్రజల భాగస్వామ్యంతో పన్నూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద 163 వ జయంతి



**అక్షర వేదం:జనవరి 12,రామగిరి**
స్వామి వివేకానంద 163 వ జయంతిని పురస్కరించుకొని,స్వామి వివేకానంద సింగరేణి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎస్ అండ్ పి స ఆర్జీ త్రీ ఆధ్వర్యంలో స్థానిక సెంటినరీ కాలనీలోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం గోదావరిఖని ఫైవ్ ఇంక్లైన్ ఏరియాలోని అమ్మ పరివార్ అనాధాశ్రమంలో ఈరోజు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బైరం సదానందం, ప్రధాన కార్యదర్శి పులిపాక రాజన్న,కారుపాకల సుధాకర్,తక్కల్ల రాములు,పొన్నం సదయ్య,మోరె శ్రీనివాస్,పోతరాజు శ్రీనివాస్,నీలగోపాల్ పాల్గొన్నారు.

## ఇటిక్యాల గ్రామంలో చైనా మంజా విక్రయాలపై పంచాయతీ కార్యదర్శి ఆకస్మిక తనిఖీలు




**అక్షర వేదం/రాయికల్ : జనవరి 12:**
రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో నిషేధిత చైనా మంజా విక్రయాలను అరికట్టేందుకు పంచాయతీ కార్యదర్శి రాజేష్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని పలు కిరాణా దుకాణాలను పరిశీలించి, గాలిపటాల కోసం ఉపయోగించే చైనా మంజా దారాన్ని విక్రయించరాదని దుకాణదారులకు కఠినంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ, చైనా మంజా అత్యంత ప్రాణాంతకమైనదిగా గుర్తించబడిందని, దీని వినియోగంతో ప్రజలు, పక్షులు, జంతువులకు తీవ్ర ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. నిషేధిత చైనా మంజాను విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత దుకాణాల షాప్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే, గ్రామంలో ఎవరైనా చైనా మంజాను విక్రయిస్తున్నా లేదా వినియోగిస్తున్నట్టు గుర్తించినట్లయితే వెంటనే పంచాయతీ కార్యాలయానికి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. చైనా మంజా రహిత గ్రామంగా ఇటిక్యాలను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

## గోపాల్ పూర్ గ్రామ క్రికెట్ టీమ్ కు టీషర్ట్స్ అందజేత



**అక్షర వేదం/మంథని,జనవరి12:**
మంథని లో జరుగుతున్న శ్రీపాద క్రికెట్ టోర్నమెంట్ కి ముఖ్య అతిధులుగా విచ్చేసిన యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి,తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ రోషిని జస్వాల్,యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు,పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ మిట్టపల్లి వెంకటేష్ చేతుల మీదుగా గోపాల్ పూర్ గ్రామ క్రికెట్ టీమ్ కు కొప్పుల రాఘవ పటేల్,ఐదో వార్డు మెంబర్ టి షర్ట్స్ స్పాన్సర్ చేయడం జరిగింది..

## ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**అక్షర వేదం/జయశంకర్ భూపాలపల్లి, జనవరి 12 :**
ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు.
సోమవారం ఐడీఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 46 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేసినట్లు పేర్కొన్నారు.
ఈ ప్రజావాణిలో వచ్చిన అన్ని దరఖాస్తులు రానున్న ప్రజావాణి నాటికి పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నారని, అందువల్ల అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో పర్యవేక్షణ లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేసిన జర్నలిస్టులు



**అక్షర వేదం/మంథని, జనవరి12:**
మంథని డివిజన్ ప్రెస్ భవన్ నిర్మాణానికి స్థలం,నిధులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు సోమవారం రోజున మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు అందరూ కలిసి వినతిపత్రం అందజేశారు. మంథనిలో పలు అభివృద్ధి ప్రారంభోత్సవాల కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా డివిజన్ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు మంత్రి శ్రీధర్ బాబును మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు జర్నలిస్ట్ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి స్థలంతో పాటు,నిధులు కేటాయించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంథని డివిజన్ కేంద్రంలో ప్రెస్ భవన్ కు స్థలం కేటాయించాలని మంథని ఆర్డీఓకు మంత్రి ఆదేశించారు. జర్నలిస్టులు ఎదురుకుంటున్న సమస్యల గురించి కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్ట్ సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుకు డివిజన్ క్లబ్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మోత్కూరి శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి కొదారి మల్లేష్,సహాయ కార్యదర్శి మాదరబోయిన కిషన్,మాటేటి కుమార్ జర్నలిస్టులు మహావాది సతీష్, రామడుగు శ్రీనివాస్,అరిగేలా నారాయణ, ఏగోళపు సంతోష్, మంథని లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు..

## డీఎస్పీ చేతుల మీదుగా వాలీబాల్ కిట్టు పంపిణీ



**అక్షర వేదం/మహాదేవపూర్, జనవరి12 :**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో కాటారం డిఎస్పి సూర్యనారాయణ చేతుల మీదుగా పలుగుల గ్రామ ఎస్సీ యూత్ కు క్రికెట్ కిట్టు, వాలీబాల్ కిట్టు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహాదేపూర్ సి ఐ వెంకటేశ్వర్లు, మహాదేవపూర్ ఎ స్ ఐ లు పవన్ కుమార్, శశాంక్, కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి తో పాటు పలుగుల గ్రామ సర్పంచి గారే విజయలక్ష్మి, ఉప సర్పంచ్ ఒద్ది చంద్రయ్య పలుగుల గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షులు మానెం మహేష్, సింగల్ విండో డైరెక్టర్ వడ్లకొండ సమ్మయ్య ,కాంగ్రెస్ యువజన అధ్యక్షులు మంద వినోద్, ఉపాధ్యక్షులు నిట్టూరి శేఖర్, మంద సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చదువులమ్మ ఒడిలో ఓ..అపూర్వ ఘట్టం

**అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం:- జనవరి 12.**



మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దముప్పారంలో 1979 వ సంవత్సరంలో ఏడవ తరగతి చదువుకున్న విద్యార్థులంతా కలుసుకొని ఆనాటి వారి పాఠశాల పూర్వ జ్ఞాపకాలను, మధురానుభూతలను చర్చించుకుని తెలియని భావోద్వేగానికి గురయ్యారు. ఈ సమావేశంలో వారి గురువులైన బాపురావు, గోపిరెడ్డి, సోమిరెడ్డి, సోమయ్యలను ఘనంగా సన్మానించినారు.మరణించిన తోటి స్నేహితులకు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పరవస్తు రజిత(రాధిక,)రజియా బేగం, లక్ష్మీనరసమ్మ ,జ్యోతి,నిర్మల, వాణిశ్రీ, జయలత, విజయ, ఉదయ,లక్ష్మి,ఝాన్సీ, పావని, శోభ,పద్మ,వెంకన్న, మార్కండేయ,శ్రీశైలం, వేణుగోపాల్, శ్రీనివాస్ అయ్యగారు, శ్రీనివాస్,వెంకట్ రెడ్డి, సమ్మయ్య,ఇంద్రసేనారెడ్డి, సుధాకర్,గణేష్,శేఖర్, జనార్దన్,నగేష్,శీలం సోమయ్య,యాకయ్య, శ్రీనివాస్,ఉపేందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి తర్వాత రాంచంద్రు నాయక్ కి మంత్రి పదవి వచ్చే అవకాశం

**అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా, డోర్నకల్ నియోజకవర్గం:- జనవరి12.**



మరి కొన్ని రోజుల్లో ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రాంచంద్రు నాయక్ కి మంత్రి పదవి వచ్చే అవకాశం డోర్నకల్ నియోజకవర్గ చరిత్రలోనే భారీ మెజార్టీ రావడం... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అత్యంత సన్నిహితుడు కావడంతో ఇది ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ కి అనుకూలంగా మారడం జరుగుతుంది వారి అభిమానులు కోరుకుంటున్నారు.

## సమ్మక్క సారలమ్మవనదేవతల పూజారులకు చీరే సారె పంపిణీ.

**- అన్నారం సర్పంచినీర్ల ప్రభాకర్**



**అక్షర వేదం/మహదేవపూర్, జనవరి 12:**
అన్నారం గ్రామపంచాయతీ. కొమురంభీమ్ కాలనిలో సర్పంచ్ ఎన్నికలకు ముందు శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను మొక్కుకోవడం జరిగింది. ఆ తల్లుల ఆశీస్సులు గ్రామప్రజల దీవెనలతో నేను గెలవడం జరిగింది. జనవరి 21,22తేదీలలో జరిగే శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా పూజరులు శివసత్తులకు. ఆదివాసీల సంస్కృతిక సంప్రదాయాలకు ఆనుగుణంగా వారందరికీ ఆకుపచ్చ రంగుగల చీరలను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదివాసీ మహిళలు. అదివాసీ నాయకులు మడే కుమార్, యువకులు పాల్గొన్నారు

## స్వయంవ్యక్త శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయశీలో కూడారై మహెూత్సవం



**అక్షర వేదం /వరంగల్ జిల్లా వెంకటేశ్వరపల్లి సన్నూరు:-జనవరి 12.**
వరంగల్ జిల్లా వెంకటేశ్వరపల్లి స్వయంవ్యక్త శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం సన్నూరులో ఆదివారం రోజున కనుల పండుగగా,వైభవశీగా కుడారై మహెూత్సవం ఆలయ ప్రధాన అర్చకులు ఏ.వి.రంగాచార్య నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమశీలో ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి,ఆలయ అభివృద్ధి కమిటి,ఆలయ అనువంశిక పూజారులు,వికాస తరంగిణి సభ్యులు,సన్నూరు సేవా బృందం,భక్తులు తదితరులుఅబశ్రీశ్రీ పాల్గొన్నారు.

## తెలంగాణా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు గోల్డ్ మెడల్ గెలుపొందిన కె సలోమి



**అక్షర వేదం/మేడ్చల్ జిల్లా,కాప్ర:- జనవరి 12.**
గాజు రాయ్ డు అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు ఆర్గనేజర్ సురభి వేణుగోపాల్ ఆధ్వర్యంలో 04/01/2026/న కరీంనగర్ రెడ్డి ఫంక్షన్ హాల్లో జరిగినవి ఈ పోటిలో అండర్ 17 కుమిటీ విభాగంలో కాప్ర కు చెందిన కురునెల్లి సలోమి పాల్గొని గోల్డ్ మెడికల్ గెలుపొందినది. సర్టిఫికెట్ ను కప్ ను బహుకరిస్తున్న సినీ ఫైట్ మాస్టర్ రవి , గ్రాండ్ మాస్టర్ సత్య శంకర్, మాస్టర్ చందన్ రావు. మాస్టర్స్ అభినందనలు తెలియజేసినారు.